సాక్షి
ప్రకాశం

మంగళవారం । 27 । ఆగస్టు । 2024

అబద్ధాల ప్రచారంలో కూటమి ప్రభుత్వం



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అబద్ధాలు ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకుంటోందని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు.

- 8లో..



డేవిడ్‌రాజుకు ఘన నివాళి

మాజీ ఎమ్మెల్యే డేవిడ్‌రాజు భౌతిక కాయానికి సోమవారం పలువురు నివాళులర్పించారు. ఒంగోలులోని క్లోపేటలో ఆయన భౌతికకాయాన్ని ఉంచారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
36/29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

నేడు ప్రశస్త్ యాప్ వినియోగంపై ఆన్‌లైన్ అవగాహన

ఒంగోలు: జిల్లాలోని పాఠశాలల ప్రిన్సిపాళ్లు, హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు, భవిత కేంద్రాల్లో పనిచేసే రిసోర్సు పర్సన్లు అందరికీ ప్రశస్త్ యాప్ వినియోగంపై ఆన్‌లైన్‌లో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి అవగాహన కల్పిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సహిత విద్య విభాగం, సమగ్రశిక్ష, కేంద్ర ప్రభుత్వంలోని పాఠశాల విద్యాశాఖ ద్వారా పాఠశాలలో నమోదైన విద్యార్థుల్లో ప్రత్యేక అవసరాలున్న వారిని ప్రాథమికంగా గుర్తించేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. ఓరియెంటేషన్‌లో అందరూ పాల్గొనాలని, యూట్యూబ్ లింక్‌ను ఇప్పటికే ఉత్తర్వుల ద్వారా మండల విద్యాశాఖ అధికారి కార్యాలయానికి పంపామన్నారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.359

- కనిష్ట ధర రూ.204

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు వేలంలో ధర సోమవారం గరిష్టంగా కేజీ రూ.359 పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 11 కేంద్రాల్లో 10,599 బేళ్లు రాగా, 8,757 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 1842 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు (పేర్నమిట్ట), వెల్లంపల్లి, ఒంగోలు, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 140వ రోజు వేలం పాటలో 5,937 బేళ్లు రాగా 4,779 వ్యాపారులు కొనుగోలు చేశారు. 1158 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ.359, కనిష్టంగా రూ.204 సరాసరి రూ.312.24 వచ్చింది. కందుకూరు-1, 2, కనిగిరి, డీసీపల్లి, కలిగిరి, పొదిలి తదితర కేంద్రాల్లో 134వ రోజు వేలం పాటలో 4,662 బేళ్లు రాగా 3978 బేళ్లు కొనుగోలయ్యాయి. 684 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.358, కనిష్ట ధర రూ.194, సరాసరి రూ.294.85 పలికింది.



ప్రత్యేక చట్టం అవసరం

వైద్య వృత్తిలో ఉంటున్న మహిళా వైద్యులు, సిబ్బందికి రక్షణ ఉండేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలి. కోల్‌కతాలో జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకుని అలాంటివి జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. డాక్టర్లు, సిబ్బంది రోగులకు నిత్యం సేవలందిస్తుంటారు. వారికి ప్రభుత్వం తాము అండగా ఉన్నామని ధైర్యం కల్పించాలి.

– డాక్టర్ పీ పృథ్వీరాజ్, పీహెచ్‌సీ వైద్యాధికారి, బేస్తవారిపేట





రక్షణ కల్పించాలి

అన్ని రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు రక్షణ కల్పించాలి. మహిళా డాక్టర్లకే కాకుండా ఎక్కడ మహిళలు పనిచేస్తున్నా వారికి భద్రత ఉంటే ధైర్యంగా వారి పనులు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలంటూ నినాదాలు ఉన్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు. ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న మహిళలకు సరైన వసతులతో పాటు రక్షణ కల్పించాలి.

– శివపార్వతి, స్టాఫ్‌నర్సు, పుల్లలచెరువు ప్రభుత్వ వైద్యశాల

పంటల బీమా.. ఏదీ ధీమా !

ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు పంటల బీమా పథకం ఉపయోగపడుతుంది. రైతు వాటాను కూడా చెల్లించి పంటల బీమా పథకాన్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేయగా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఖరీఫ్ పంటల బీమా ప్రీమియాన్ని ఇంత వరకు చెల్లించలేదు. 3,59,965 ఎకరాల్లో ఈ- క్రాప్ నమోదైన రైతుల్లో పంటలు నష్టపోయిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది.



తాళ్లూరు మండలం కొత్తపాలెంలో గత ఖరీఫ్‌లో సాగు చేసిన దెబ్బతిన్న అరటి తోట

- గత ఖరీఫ్ పంటల బీమా ప్రీమియం నగదు చెల్లించని కూటమి ప్రభుత్వం
- గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏటా ఏప్రిల్, మే నెలల్లో ప్రీమియం చెల్లించి జూన్‌లో రైతులను ఆదుకున్న వైనం
- బీమా ప్రీమియం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్న రైతన్నలు

జిల్లాలో గత ఖరీఫ్ సీజన్‌లో సాగు
3,74,652 ఎకరాలు

ఈక్రాప్‌లో నమోదైంది
3,59,965 ఎకరాలు

ఒంగోలు సెంట్రల్:

ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం ఈ-క్రాప్‌నకు పేరు మార్పు చేసి, ఈ-పంట నమోదుకు శ్రీకారం చుట్టింది. ఖరీఫ్‌కు సైతం గత ప్రభుత్వంలో మాదిరే పంటనష్టం ప్రీమియం చెల్లించనున్నారు. రబీలో మళ్లీ పంటల బీమాకు రైతులే స్వంత నగదు చెల్లించుకునేలా రూపకల్పన చేశారు. అయితే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పూర్తి స్థాయిలో ఈ-క్రాప్ నమోదు తర్వాత రైతు వాటా సైతం చెల్లించి పంటల బీమాను అమలు చేసింది. 2019లో సైతం రైతులకు చెల్లించాల్సిన పంట నష్టాలను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించకపోవటంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ సొమ్ము చెల్లించారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం 2023-24 ఖరీఫ్‌లో ఈ-క్రాప్ ద్వారా నమోదైన ఉచిత పంట బీమా ప్రీమియాన్ని చెల్లించాల్సి ఉంటుంది. అలా చెల్లించినట్లయితే ఈ సంవత్సరం ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు బీమా నగదు ఆయా సంస్థల ద్వారా అందుతుంది. ప్రస్తుత ప్రభుత్వం ఆ నగదు చెల్లించటంలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. గత ఖరీఫ్ సీజన్‌లో 3,74,652 ఎకరాలు సాగు చేయగా 3,59,965 ఎకరాలు ఈ-క్రాప్ నమోదైంది. అందులో పంటలు నష్టపోయిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది.

గతంలో ఆదుకున్న వైనం ఇలా...

2019 ఆగస్టులో, అక్టోబర్‌లలో సంభవించిన భారీ వర్షాలకు, 2020 జనవరి, ఫిబ్రవరి, ఏప్రిల్, సెప్టెంబర్, అక్టోబర్, నివార్ తుఫాన్‌కు సంభవించిన నష్టాలకు, 2021లో నవంబర్ లో 2020 సెప్టెంబర్‌లో, 2022 డిసెంబర్‌లో సంభవించిన మాండూస్ తుఫాన్, 2023 మార్చిలో అకాల వర్షాలకు సంభవించిన నష్టాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్పందించి ఇన్‌పుట్ సబ్సిడీ అందించింది. ఎన్నికల అనంతరం మిచాంగ్ తుఫాన్ ఇన్‌పుట్ సబ్సిడీ సైతం ఇచ్చారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం గత ఖరీఫ్ ఉచిత పంటల బీమా ప్రీమియం చెల్లించి రైతన్నలను ఆదుకోవాలని కోరుతున్నారు.

మాట తప్పక.. మడమ తిప్పక .. ఆదుకున్న జగన్

సీజన్ దాటక ముందే పంట నష్ట పరిహారాన్ని రైతులకు అందించాలనే సంకల్పంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జిల్లా యంత్రాంగానికి ప్రతిసారి కచ్చితమైన ఆదేశాలు ఇచ్చి ఆదుకున్నారు. ఎన్నికలు ముగిసినా సరే ఇచ్చిన మాట ప్రకారం రైతన్నలను ఆదుకోవటంపై నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు.

గత వైఎస్సార్ సీపీ హయాంలో చెల్లించిన నష్టపరిహారం వివరాలు ఇలా ఉన్నాయి..

సంవత్సరం	పంట నష్టపోయిన రైతులు	ఎకరాలు	విలువ (లక్షల్లో)
2019	1510	2,197.4	55.49
2020	1,34,623	2,30,876.05	1,0338.12
2021	18,715	29,966.82	1647.57
2022	28,727	63,147.08	2563.41
2023	341	606.52	34.77
2023 మిచాంగ్	3775	4,975.9	282.32
మొత్తం	**1,87,691**	**3,31769.77**	**14921.67**



ముండ్లమూరు మండలంలో దెబ్బతిన్న మిరప తోట

ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం గత ఖరీఫ్ ఉచిత పంటల బీమా ప్రీమియం చెల్లించి రైతన్నలను ఆదుకోవాలని కోరుతున్నారు.

సాగునీరు..రానీయరు !

- జిల్లాపై కూటమి ప్రభుత్వం పక్షపాతం
- జోన్ వన్‌కే సాగర్ జలాల ప్రకటన
- జోన్-2కి ప్రకటించని ప్రభుత్వం
- ఆరుతడి పంటలు వేసుకోవాలని కలెక్టర్ సూచన
- వర్షాలు లేక సాగర్ జలాల కోసం ఎదురు చూస్తున్న రైతులు

దర్శి: సాగర్ కుడికాలువ జోన్ వన్‌కు సాగు నీరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో అక్కడి రైతులు నార్లు పోసుకునేందుకు సిద్ధమయ్యారు. జోన్-2లో నీరిస్తామని మాత్రం ప్రకటించలేదు. దీంతో జిల్లాకు చెందిన ఆయకట్టు రైతులు నార్లు పోసుకోవాలా లేదా అనే అయోమయంలో పడ్డారు. వర్షాలు లేక పొలాలు బీళ్లుగా మారిన జోన్ -2కు మాత్రం నీటి విడుదల పై ప్రభుత్వం మౌనం వహించడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారంలోకి వచ్చినప్పుడల్లా చంద్రబాబు సాగర్ జలాల విషయంలో ప్రకాశం జిల్లా పై పక్షపాతం చూపిస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 4.42 లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టు ఉంది. దర్శి డివిజన్ పరిధిలో లక్ష ఎకరాల ఆయకట్టు ఉంది. ఇది కాక ఆయకట్టు చివరి భూముల్లో కొంత మెట్ట పైర్లు వేసుకుని పంటలు పండిస్తున్నారు. గత నెలలో తాగునీటి కోసం 4.5 టీఎంసీలు సాగర్ జలాలు విడుదల చేశారు. ఆ నీటితో పాటు ఇప్పటి వరకు సాగర్ జలాలు వస్తూనే ఉన్నాయి. అయినా ప్రకాశం జిల్లాకు మాత్రం సాగునీటిని కేటాయించలేదు. దీనికి తోడు ఆయకట్టు పరిధిలో నీరు వస్తుందని ఆశతో వేసుకున్న మొక్కజొన్న వంటి ఆరుతడి పంటలు సైతం ఎండు ముఖం పట్టాయి.



ఆయకట్టు పరిధిలో సిద్ధం చేసిన వరినార్లు



రజానగరం మేజర్ పరిధిలో ఎండిపోతున్న మొక్కజొన్న



ఎండిన వరిని చూపిస్తున్న రైతు రవీంద్రారెడ్డి

వర్షాలు లేక సాగర్ జలాల కోసం ఎదురు చూపులు:

జిల్లాలో 3,53,442 లక్షల ఖరీఫ్ సాగు విస్తీర్ణం ఉండగా 45,275 ఎకరాల విస్తీర్ణంలో మాత్రమే సాగు చేశారు. అంటే 13 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. దర్శి డివిజన్ పరిధిలో 11 నోటిఫైడ్, 38 నాన్ నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. ఈ చెరువులు అన్నీ నింపితేనే గ్రామాల్లో బోర్లు రీచార్జ్ అయ్యి భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటుతున్న తరుణంలో వాగుల్లో చుక్కనీరు లేక పశుపోషకులు సైతం జీవాల నీటి కోసం అల్లాడుతున్నారు.

ఆశలు అడియాశలేనా..

సాగర్ ఆయకట్టు పరిధిలో ఆరుతడి పంటలు వేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రకటించారు. దీంతో రైతుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. ప్రాజెక్టులు కళకళలాడుతున్నాయి. సాగర్ జలాలు వస్తాయన్న ఆశతో ఈ పాటికే చాలా ప్రాంతాల్లో రైతులు వరినార్లు పోసుకుని నాటుకునేందుకు సిద్ధం చేసుకున్నారు. ఈ తరుణంలో కలెక్టర్ ప్రకటన రైతులను తీవ్ర నిరాశకు గురిచేసింది. సెప్టెంబర్ మొదటి వారంలో వరికి సాగర్ జలాలు విడుదల చేస్తామని మొదట ప్రకటించారు. ఆ తరువాత ఆరుతడి పంటలు వేసుకోవాలని చెప్పడం పై అసలు వరికి సాగర్ జలాలు ఇస్తారా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సాగర్ జలాలు వస్తాయన్న ఆశతో కరువది మేజర్ పరిధిలోని కొర్రపాటి వారిపాలెం మైనర్ కాలువ కింద 400 ఎకరాల్లో మొక్కజొన్న వేశారు. సాగర్ జలాలు రాక వర్షాలు కురవక మొక్క జొన్న ఎండి పోతుందని, మరో వారం గడిస్తే పంట మొత్తం నష్టపోవాల్సి వస్తుందని ఆ తరువాత నీరు విడుదల చేసినా ప్రయోజనం ఉండదని రైతులు వాపోతున్నారు.

వరికి సాగర్ జలాలు విడుదల చేయాలి



వరికి సాగర్ జలాలు విడుదల చేయకపోతే రైతులందరూ అల్లాడిపోవాల్సి వస్తుంది. నీటి కోసం ఆయకట్టు రైతులందరూ ఎదురు చూస్తున్నారు. కొందరు నార్లుకూడా పోసుకున్నారు. సాగర్ జలాలు నమ్ముకుని వేసిన ఆరుతడి పంటలు కూడా ఎండిపోతున్నాయి. వెంటనే సాగర్ జలాలు సాగుకు ఇవ్వాలి.

– యానాం నాగయ్య, కొత్తపాలెం, తాళ్లూరు మండలం ఆయకట్టు రైతు

అధికారుల ప్రకటనలు ఆందోళన కలిగిస్తున్నాయి



ఆరుతడి పంటలు వేసుకోవాలని చెప్తున్నారు. ఈపాటికే నార్లు పోసుకుని సాగర్ జలాలపై ఆశతో ఉన్నారు. ప్రస్తుతం అధికారుల ప్రకటనతో ఏం చేయాలో పాలు పోవడం లేదు. జోన్-2 ప్రాంతం అయిన ప్రకాశం జిల్లాకు సాగర్ జలాలు వరికి ఇస్తామని స్పష్టమైన ప్రకటనలు చేస్తేనే రైతులకు మేలు కలుగుతుంది.

– బీ వీరనాగిరెడ్డి, కొత్తపాలెం, తాళ్లూరు మండలం, ఆయకట్టు రైతు



ఒంగోలులో కోటీస్ షాపింగ్‌మాల్ వద్ద నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలో శ్రీకృష్ణుడి వేషధారణలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

మురిపాల పట్టి.. ఉట్టి కొట్టి

కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా జిల్లాలో శ్రీకృష్ణ ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల సామూహికంగా ఉట్టికొట్టే వేడుకలు నిర్వహించారు. చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ఉట్టికొట్టి సందడి చేశారు.

- సాక్షి నెట్‌వర్క్

ఇక ఆరు రోజులు పరీక్షలు

- పాఠశాలల్లో ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షను సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ టెస్టుగా మార్పు
- నేటి నుంచి పరీక్షలు

పుల్లలచెరువు: పాఠశాల స్థాయిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు అంచనా వేసేందుకు నిర్వహించే యూనిట్ పరీక్షల పేరును విద్యాశాఖ మార్పు చేసింది. ఇంత వరకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ)గా ఉన్న యూనిట్ టెస్టులను సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ (ఎస్‌ఏఎం)గా మార్చుతూ ఇటీవల ఉత్తర్వులు విడుదల చేసింది. ఏడాదికి మూడు సార్లు నిర్వహించే యూనిట్ టెస్టులను ఇప్పటి దాకా రోజుకు రెండు పరీక్షల చొప్పున నిర్వహించేవారు. తాజా ఆదేశాల మేరకు ఇక నుంచి ఈ ఎస్‌ఏఎం లు ప్రతి రోజు ఒక్కొక్క సబ్జెక్టు వంతున ఆరు రోజులు కొనసాగిస్తారు. షెడ్యూల్ ప్రకారం ఈ పరీక్షలు మంగళవారం నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రైవేట్ మినహా అన్ని ప్రభుత్వ అనుబంధ పాఠశాలలకు జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ నుంచి ప్రశ్న పత్రాలు సరఫరా కానున్నాయి.

మార్కుల నమూనాలో మార్పులేదు

యూనిట్ పరీక్షల స్థానంలో ఇంత వరకు నిర్వహించే ఫార్మెటివ్ పరీక్షల స్థానంలో 20 మార్కులకు మాత్రమే ఉండడంతో ఉదయం, మధ్యాహ్నం కలిపి రెండేసి పరీక్షల చొప్పున నిర్వహించి మూడు రోజుల్లో పూర్తి చేసేవారు. తాజా మార్గదర్శకాల ప్రకారం ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో రోజు చొప్పున ఆరు రోజుల పాటు పరీక్షలు జరపనున్నారు. దీని వల్ల ఏడాది లో సిలబస్ పూర్తి చేయడానికి సమయం చాలదని, దీని ప్రభావం ఫైనల్ పరీక్షలపై చూపుతుందని ఉపాధ్యాయ వర్గాలు వాపోతున్నాయి. నెలవారీ సిలబస్‌లో 3 రోజులు కుదించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.



పాఠశాలలోని విద్యార్థులు

పరీక్ష షెడ్యూలు ఇదీ..

ప్రాథమిక తరగతులకు ఉదయం గం.10.45 నుంచి గం.11.45 వరకు పరీక్ష నిర్వహిస్తారు. 28న తెలుగు, 30న ఇంగ్లిషు, 31 గణితం, సెప్టెంబర్ 2న పరిసరాల విజ్ఞాన పరీక్షలు ఉంటాయి. ఉన్నత తరగతులకు మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు నిర్వహించనున్నారు. 27న ఓఎస్ఎస్‌సీ, 28న తెలుగు, 30న హిందీ, 31న ఇంగ్లిషు, 2న గణితం, 3న సైన్స్, 4న సోషల్ సబ్జెక్టుపై పరీక్షలు ఉంటాయి.

ఖోఖో ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన అండర్-14 బాలికల జట్టు

జే.పంగులూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్-14 విభాగంలో బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. సోమవారం స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణ జూనియర్ కళాశాలలో, ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో ఈఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ ఎంపికకు 100 మంది బాలురు, 50 మంది బాలికలు పాల్గొన్నారు. వీరిలో మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు. ఎంపికలో జిల్లా కార్యదర్శి బీ కాశీవిశ్వనాథరెడ్డి, ట్రెజరర్ హనుమంతురావు, పీడీలు రమాదేవి, వసంతరఘుబాబు, సావిత్రమ్మ, శ్రీనివాసులు, సౌజన్య, కె ప్రసాద్, వీరాంజనేయులు, అజయ్ పాల్గొన్నారు. ఎంపికైన బాలుర జట్లకు ఈ నెల 27 నుంచి ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ ఇస్తారని తెలిపారు. క్రీడాకారుల ఎంపికకు గ్రామస్తులు భోజన వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపికైన బాలబాలికల జట్లను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రావూరి రమేష్, రోటరీ క్లబ్ సభ్యులు చిలుకూరి వీరరాఘవయ్య పాల్గొని క్రీడాకారులను అభినందించారు.



అండర్-14 బాలుర జట్టు

క్లుప్తంగా

గోకులంలో స్థలం కబ్జా

- వృద్ధుడిపై టీడీపీ నేతల దాడి
- బాధితుడిపైనా కేసు కట్టిన పోలీసులు



చికిత్స పొందుతున్న వెంకటేశ్వరరెడ్డి

వెలిగండ్ల: మండలంలోని గోకులం గ్రామంలో బత్తుల వెంకటేశ్వరరెడ్డి, బత్తుల రఘునాథరెడ్డికి చెందిన స్థలాన్ని టీడీపీ నాయకుడు మస్తాన్‌రెడ్డి కబ్జా చేయడమే కాకుండా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన ఈనెల 22వ తేదీన చోటుచేసుకోగా ఆదివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ నేతల దాడిలో 62 ఏళ్ల వయసున్న బత్తుల వెంకటేశ్వరరెడ్డి తలకు తీవ్ర గాయమైంది. స్పృహ కోల్పోయిన ఆయనను చికిత్స నిమిత్తం కనిగిరికి తరలించారు. ఇదిలా ఉండగా నిందితుడు మస్తాన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు బాధితులపై కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.శివ తెలిపారు.

యూనియన్ బ్యాంక్‌లో సిబ్బంది చేతివాటం

- 9 మందికి చెందిన 220 గ్రాముల బంగారం మాయం
- బ్యాంక్ ఆడిట్‌లో గుట్టు రట్టు

కనిగిరి రూరల్: కనిగిరి పట్టణంలోని యూనియన్ బ్యాంకులో సిబ్బంది చేతివాటం చూపారు. రుణం కోసం ఖాతాదారులు కుదువపెట్టిన బంగారం ఆభరణాలను బ్యాంకులో పనిచేసే సిబ్బంది అపహరించిన ఘటన సోమవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. యూనియన్ బ్యాంకులో మొత్తం 408 మంది బంగారంపై రుణాలు పొందారు. వారం రోజుల క్రితం ఒక వ్యక్తి రుణం చెల్లించి తన బంగారం తీసుకెళ్లేందుకు రాగా వాటిలో ఒక వస్తువు కనిపించలేదు. దీంతో బ్యాంకు అధికారులు సోమవారం ఆడిట్ నిర్వహించగా 9 మంది వ్యక్తులకు చెందిన ఒక్కో ఆభరణం(మొత్తం 220 గ్రాములు) కనిపించడం లేదని తేలింది. బ్యాంక్ మేనేజర్ వెంకట్రావ్ సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.త్యాగరాజు తెలిపారు.

వేములపాడులో పారిశుధ్య పనులు



వేములపాడులో పారిశుధ్య పనులు చేయిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

హనుమంతునిపాడు: మండలంలోని వేములపాడు గ్రామంలో సోమవారం ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించడంతోపాటు పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేయించారు. సోమవారం 'సాక్షి'లో 'జ్వరాల పంజా' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది కలిసి దోమల నివారణకు చర్యలు చేపట్టారు. మురుగు గుంటల్లో నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వర పీడితులను గుర్తించారు. వైద్య పరీక్షల అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి దార్ల సందీప్‌కుమార్, ఈఓపీఆర్డీ షేక్.షరీఫ్, ఏఎన్ఎంలు, ఆశాలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తగులుదాం రండిరా!

తర్లుపాడులో తన్నుకున్న తెలుగు తమ్ముళ్లు



బాహాబాహీకి దిగిన టీడీపీ నేతలు

తర్లుపాడు: అనేక అనుమానాల మధ్య అనూహ్యంగా అధికారం చేజిక్కించుకున్న కూటమి నేతలు స్థానికంగా పెత్తనం కోసం వీధి పోరాటానికి దిగారు. ఇంటింటికీ తిరిగి సూపర్ 6 అమలు, మీ కుటుంబాలకు బాబు భరోసా అని చెప్పిన నేతలు అధికారం రాగానే పదవులు, పనుల్లో వాటాల కోసం వర్గాలుగా విడిపోయి రోడ్డెక్కారు. సోమవారం తర్లుపాడు వీధుల్లో సై అంటే సై అంటూ సవాళ్లు విసురుతూ బాహాబాహీకి దిగారు. మండల కేంద్రమైన తర్లుపాడులో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడి పుట్టినరోజు వేడుకల సందర్భంగా టీడీపీలోని రెండు వర్గాల నాయకులు హంగామా సృష్టించారు. పార్టీ నాయకుడు కాశంగి శ్రీనుపై గ్రామ పార్టీ అధ్యక్షుడు వివక్ష చూపుతున్నారన్న ఆరోపణలతో ఈ వివాదం మొదలైంది.

కందులపై రెడ్డి సామాజికవర్గం గుర్రు

తర్లుపాడులో టీడీపీకి మెజారిటీ వచ్చేందుకు కృషి చేసిన తమను ఎమ్మెల్యే నారాయణరెడ్డి పట్టించుకోవడం లేదంటూ రెడ్డి సామాజిక వర్గం నేతలు గుర్రుగా ఉన్నారు. ఉద్యోగుల బదిలీలు, అనుకూలమైన వారి పోస్టింగుల విషయంలో కనీసం తమ అభిప్రాయాలు కూడా తీసుకోకపోవడాన్ని అవమానంగా భావిస్తున్నారు. మొదటి నుంచి పార్టీకి అండగా ఉన్న తమతో ఎమ్మెల్యే కందుల వ్యవహరిస్తున్న తీరును సన్నిహితుల వద్ద ఏకరువు పెడుతున్నారు.



కఠిన చట్టాలు తేవాలి

ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేస్తున్న డాక్టర్లపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించే చట్టాలు అమలులోకి తేవాలి. ఇటీవల కాలంలో డాక్టర్లపై దాడులు అధికం కావడం శోచనీయం. డాక్టర్లతోపాటు సిబ్బందికి కూడా పోలీసు రక్షణ ఉండాలి. అన్ని వైద్యశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. డాక్టర్లపై దాడులకు పాల్పడిన నిందితులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయాలి.

– డాక్టర్ సీతారామిరెడ్డి, ఎండీ, మార్కాపురం



డాక్టర్ల ప్రాణాలకు భద్రత కల్పించాలి

వైద్యులను దేవునితో సమానంగా భావించే సమాజంలో వారి ప్రాణాలకు రక్షణ లేకుండా పోవడం సరైంది కాదు. ఎవరి ప్రాణమైనా విలువైందే. కానీ వైద్యులు భయంతో ఉండే పరిస్థితి వస్తే, ఒక్కో సమయంలో చాలా మంది ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. వైద్యులపై ఏ విధమైన ఒత్తిడి లేకుండా చూడాలి. అప్పుడే ప్రశాంత వాతావరణంలో ప్రాణాలకు అపాయం లేకుండా కాపాడుతారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి ఒడిగట్టిన వారిని కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ నాగరాజు, ప్రభుత్వ వైద్యులు,పొదిలి



బతుకు'బొమ్మ'



బతుకుదెరువు కోసం ఉత్తరాది రాష్ట్రాల నుంచి వలస వస్తున్న చిరువ్యాపారులు బొమ్మలు విక్రయిస్తూ పూట గడుపుకొంటున్నారు. ఒంగోలు నగరంలోని కలెక్టరేట్, నెల్లూరు బస్టాండ్, మినీ స్టేడియం, కర్నూలు రోడ్ బైపాస్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో రోడ్డు పక్కనే విమానాల బొమ్మలను ఆకర్షణీయంగా ఉంచి కొనుగోలుదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

నిమ్మకు'నీరు'



ఒంగోలు నగరంలోని పీవీఆర్ నగరపాలక బాలికల హైస్కూల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మనబడి నాడు–నేడు కింద ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్ మూతపడింది. దాతలు ఇచ్చిన చిన్న వాటర్ కూలర్‌ను వినియోగిస్తుండటంతో విద్యార్థినులు క్యూలో నిల్చుని నీరు పట్టుకోవాల్సిన దుస్థితి. విద్యాశాఖ అధికారులు దీనిపై ఎలా స్పందిస్తారో?

– ఫొటోలు : సాక్షి, ఒంగోలు

మాజీ ఎమ్మెల్యే డేవిడ్‌రాజుకు ఘన నివాళి



దేవిడ్‌రాజు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి దోలా



దేవిడ్‌రాజు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

ఒంగోలు సెంట్రల్: మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు మృతి చాలా బాధాకరమని మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఒంగోలులోని క్లాపేటలో డేవిడ్‌రాజు నివాసంలో ఆయన భౌతికకాయాన్ని సోమవారం మంత్రి స్వామి సందర్శించి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎంపీపీ స్థాయి నుంచి కష్టపడి ఎదిగి, జిల్లా పరిషత్ చైర్మన్‌గా, సంతనూతలపాడు, యర్రగొండపాలెం ఎమ్మెల్యేగా విశేష సేవలు అందించారన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

- మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య, వైస్ ప్రెసిడెంట్ బత్తుల వెంకటరావు, బత్తుల సుబ్రహ్మణ్యం, జీవన్ తదితరులు డేవిడ్‌రాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్యే తాటిపర్తి నివాళి

యర్రగొండపాలెం: రాజకీయాల్లో చిన్న స్థాయి నుంచి పైకి ఎదిగిన వ్యక్తి డేవిడ్‌రాజు అని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని అపోలో వైద్యశాలలో డేవిడ్‌రాజు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి, యర్రగొండపాలెం నియోజకవర్గ పురోభివృద్ధికి డేవిడ్‌రాజు బాటలు వేశారని కొనియాడారు.

మాజీ మంత్రి సురేష్ పరామర్శ

సింగరాయకొండ: మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు కుటుంబాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పరామర్శించారు. సోమవారం డేవిడ్‌రాజు కుమారుడు విజేష్‌రాజుతో ఫోన్లో మాట్లాడి ధైర్యం చెప్పారు. భగవంతుడు డేవిడ్‌రాజు ఆత్మకు శాంతిని ప్రసాదించాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘనంగా బూచేపల్లి వెంకాయమ్మ జన్మదిన వేడుకలు



వెంకాయమ్మకు కేక్ తినిపిస్తున్న కుమారుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పుట్టినరోజు వేడుకలు సోమవారం చీమకుర్తిలో ఘనంగా నిర్వహించారు. ఆమె తన కుమారుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి బూచేపల్లి పార్కులో మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి, బూచేపల్లి కమలాకర్‌రెడ్డి స్మారకాల వద్ద నివాళులర్పించారు. తొలుత బూచేపల్లి నివాసం వద్ద, పార్కులో కేక్ కట్ చేశారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లుతోపాటు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

అబద్ధాల ప్రచారంలో కూటమి ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



అన్నా రాంబాబు

మార్కాపురం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అబద్ధాలు ప్రచారం చేసుకుంటూ పబ్బం గడుపుతోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి అన్నా రాంబాబు విమర్శించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల ఒకే రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ పథకానికి సంబంధించి గ్రామ సభలు పెట్టామని టీడీపీ కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడాన్ని తప్పుబట్టారు. ఉపాధి హామీ పథకంలో ఏవైతే అమలు చేయాలో వాటిని మాత్రమే గ్రామసభల్లో తీర్మానించారని, గ్రామాల్లో ప్రజలకు అవసరమైన పనులను వదిలేసి అదేదో రికార్డు సృష్టించినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదని కూటమి నాయకులు విమర్శలు చేయడాన్ని ఖండించారు. వైఎస్సార్ సీపీ పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి, ప్రతి నియోజకవర్గానికి రూ.35 కోట్ల నుంచి రూ.40 కోట్ల వరకు నిధులు కేటాయించారని గుర్తు చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను కళ్లు తెరిచి చూడాలని హితవు పలికారు. దురదృష్టవశాత్తు కరోనా రావడంతో పనులు నిదానంగా జరిగాయే తప్ప అభివృద్ధి లేదని కూటమి నాయకులు చెప్పడం సరికాదన్నారు. ప్రజలకు ఏది అవసరమో ఆ పనులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు. కూటమి నాయకులు మాత్రం ఒకే రోజు గ్రామ సభలు పెట్టి అన్నీ చేసేస్తున్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని, అబద్ధాలను ఊదరగొడితే వారు నమ్మరనే విషయాన్ని కూటమి నేతలు గ్రహిస్తే మంచిదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏమీ చేయలేదనే తప్పుడు ప్రచారాన్ని కూటమి నేతలు ఇకనైనా మానుకోవాలని అన్నా రాంబాబు హితవు పలికారు.

బ్యార్నీ, పొలాలు అధిక కౌలుకు తీసుకోవద్దు

- టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్



టంగుటూరులో రైతులతో మాట్లాడుతున్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

టంగుటూరు/కొండపి(సింగరాయకొండ): బ్యార్నీ, పొలాలు అధిక కౌలుకు తీసుకోవద్దని, బోర్డు నిర్ణయించిన అధీకృత ప్రాంతం, అధీకృత పరిమాణానికి లోబడే రాబోయే పంట కాలంలో పొగాకు సాగు చేయాలని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం టంగుటూరు, కొండపిలో పొగాకు వేలం ప్రక్రియను పరిశీలించిన అనంతరం రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టుబాకో బోర్డు చైర్మన్ మాట్లాడుతూ.. రాబోయే సీజన్లో పంట పరిమాణాన్ని స్థిరీకరించడం, ఉత్పత్తి నియంత్రణ వెనుక ఉన్న కారణాలను వివరించారు. పొగాకు అక్రమ విక్రయాల్లో పాల్గొనవద్దని రైతులకు సూచించారు. ప్రస్తుత మార్కెట్లో ఉన్న పర్యవసానాలను వివరించారు. ప్రభుత్వంతో మాట్లాడి రైతుల వద్ద అధికంగా ఉన్న పొగాకు అమ్ముకొనుటకు అపరాధం రుసుం లేకుండా అనుమతి తీసుకొచ్చిన విధానం గురించి వివరించారు. పొగాకు బోర్డు సూచనలు పాటిస్తూ, నాణ్యమైన పొగాకును పండించి లాభాలు పొందాలని చెప్పారు. ముఖ్యంగా పొగాకు రైతులు అందరూ పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్క రైతు బ్యార్నీకి పది మొక్కలు తప్పనిసరిగా నాటాలని కోరారు. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగం తగ్గించడం వలన వీలైనంత వరకు రైతుల అందరూ ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. అనంతరం టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో పూర్తయిన వివిధ అభివృద్ధి పనుల గురించి వివరించారు. రైతుల అభివృద్ధి కోసం మునుముందు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కొండపి, టంగుటూరులో వర్జీనియా పొగాకు ఉత్పత్తిదారుల సంఘం తరపున బోర్డు చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు, ఎస్జీఓ సిద్ధరాజు, పొగాకు బోర్డు సభ్యులు మారెడ్డి సుబ్బారెడ్డి, పి.వరప్రసాదరావు, బొడ్డపాటి బ్రహ్మయ్య, రైతు సంఘ అధ్యక్షుడు పోతుల నరసింహారావు, బోర్డు సిబ్బంది, అన్ని కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం

- 55 ఏళ్ల తర్వాత కలుసుకున్న ఎస్ఎస్ఎల్సీ ఆఖరి బ్యాచ్ విద్యార్థులు
- భావోద్వేగానికి గురైన స్నేహితులు

చీరాల టౌన్: నూనూగు మీసాలు, తోటివారిని ఆటపట్టించే వయస్సు చదువులో పోటీ పడటం తరగతి గదిలో చేసిన అల్లర్లు ఉపాధ్యాయులతో మందలింపులు ఓవైపు జీవితంలో ఉన్నతంగా నిలవాలనే కసి మరో వైపు వెరసి చక్కగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలిచి వివిధ ప్రభుత్వశాఖల్లో పని చేసి పదవీ విరమణ చేసిన వారు కొందరు అప్పటి ఎస్ఎస్ఎల్సీ విద్యార్థులు 55 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ అప్పుడు జరిగిన ఘటనలను తలుచుకుంటూ ఉబ్బితబ్బిబ్బయ్యారు. 55 ఏళ్ల తర్వాత చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒక్కసారిగా కలుసుకున్న వారి కళ్లల్లో ఆనందాలు ఓవైపు ఉండగా పలుకరింపులు, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను కలుసుకుని 'పూర్వ' విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం పేరాలలోని ఏఆర్ఏ హెచ్ఎం హైస్కూల్లో నిర్వహించారు. 1968–1969 ఎస్ఎస్ఎల్సీ ఆఖరి బ్యాచ్ చదివిన విద్యార్థులందరూ తాము పాఠశాలలో చదివి 55 ఏళ్ల పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆ నాటి పదోతరగతి విద్యార్థులందరూ హాజరై ఒకరినొకరు పలకరించుకుంటూ అప్పటి సంగతులను గుర్తుకు తెచ్చుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లరిని, ఆడుకున్న ఆటలను, ఒకరిపై ఒకరు పోటీపడి చదవడం వంటివి తలుచుకుని ఆనందానికి గురయ్యారు. ఎక్కడెక్కడో ఉన్న వారందరం కుటుంబ సభ్యులతో సహ అందరం ఒక చోట కలుసుకోవాలని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు గోలి దేవేంద్రనాధం, అమర్‌నాథ్, శ్రీకృష్ణ, భుజంగరావు, జోనేష్, వీరయ్య, నాగేశ్వరరావు, మదనగోపాలరావులు తెలిపారు. ఈ సందర్భంగా అప్పటి పాఠశాల ఎస్ఎస్ఎల్సీ ఆఖరి బ్యాచ్ విద్యార్థుల్లో చాలామంది పూర్వ విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. వీరిలో కొందరు వ్యాపారవేత్తలు, కొంతరు త్రివిధ దళాల్లో పనిచేసిన వారు. టీచర్లుగా పనిచేసిన ఉద్యోగార్థులుగా, వ్యాపారస్తులుగా ఉన్నారు.

తాము ఉన్నత స్థానాలలో ఉండేలా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించకున్నారు. ప్రస్తుత హైస్కూల్ హెచ్ఎం బి.సాల్మన్‌రాజ్‌కు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చదువుల్లో ప్రతిభ చూపిన పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాల బహుమతులు అందించారు. పూర్వ విద్యార్థులు ఫొటోలు దిగారు.

పంగులూరులో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

- సెప్టెంబర్ 20,21,22 తేదీల్లో పోటీలు

జే.పంగులూరు: పంగులూరులో సెప్టెంబర్ 20,21,22 తేదీల్లో అండర్–14 విభాగంలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు జరగనున్నట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచు గరటయ్య సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గరటయ్య మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో ఇప్పటికీ 10 సార్లు రాష్ట్ర ఖోఖో పోటీలు, 3 సార్లు జాతీయస్థాయి ఖోఖో పోటీలు అంత్యత వైభవంగా నిర్వహించనట్లు తెలిపారు. 11వ సారి నిర్వహించే పోటీలు కూడా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ పోటీలకు కూడా గ్రామస్తులు సహకరించాలని కోరారు. రాష్ట్రస్థాయిలో పంగులూరులో ఖోఖో పోటీలకు మంచి గుర్తింపు తీసుకొచ్చిన సీతారామిరెడ్డిని అభినందించారు. అనంతరం రాష్ట్ర ఖోఖో కార్యదర్శి సీతారామిరెడ్డి మాట్లాడుతూ పంగులూరులో ఇన్ని సంవత్సరాలు ఖోఖో క్రీడను ఆదరిస్తున్న గ్రామస్తులు, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచు గరటయ్య సహకారం మరువలేనిదని తెలిపారు. పంగులూరు గ్రామం నుంచి 100 మంది ఖోఖో ఆడి మంచి భవిష్యత్ ఏర్పాటు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రాయిణి ప్రమీళ వెంకటసుబ్బారావు, మండల ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి కాశీవిశ్వనాథరెడ్డి, ట్రెజరర్ హనుమంతురావు, రొటేరీయన్లు వీరరాఘవయ్య, సింగర్, సాంబశివరావు, హనుమంతురావు, సుబ్బారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

సాగర్ నిండినా నీరివ్వకపోవడం దారుణం

- ఆయకట్టు రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు
- సాగర్ నీటి మట్టం 540 అడుగులు ఉన్నప్పుడే వైఎస్సార్ నీరిచ్చారు
- రైతు సంఘం నేత నందు వెంకటేశ్వరరావు



వెంకటేశ్వరరావు

దర్శి: ప్రకాశం జిల్లాలో వరి సాగుకు సాగర్ నీరు అందించకుండా, కనీసం ఎప్పుడిస్తారో ప్రకటించకుండా జిల్లా రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని రైతు సంఘం దర్శి డివిజన్ కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రకాశం జిల్లాలో ఆరుతడి పంటలకే సాగర్ నీరు అని కలెక్టర్ ప్రకటించడంపై సోమవారం ఒక ప్రకటనలో స్పందించారు. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు నాగార్జున సాగర్ డ్యామ్ నిండి దిగువకు నీరు వదులుతున్నా.. జిల్లాలో మాత్రం ఆరుతడి పంటలకు మాత్రమే నీరిస్తామని కలెక్టర్ ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. డ్యామ్ 20 రోజుల క్రితమే పూర్తి స్థాయిలో నిండగా అధికారుల ప్రకటన కోసం ఎదురు చూస్తున్న రైతులను నిరాశకు గురిచేశారని మండిపడ్డారు. జిల్లాలో సాగర్ ఆయకట్టు పరిధిలో 1.05 లక్షల ఎకరాల్లో మాగాణి, 1.50 లక్షల ఎకరాల్లో ఆరుతడి పంటలు అధికారకంగా సాగు చేస్తారన్నారు. గతేడాది డ్యాంలో నీరు లేక రైతులు మెట్ట పైర్లకే పరిమితమయ్యారన్నారు. పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా 2004లో 540 అడుగులు ఉన్నప్పుడే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం వరి పైరుకు నీరు అందించిన విషయం అధికారులు గుర్తు చేసుకోవాలన్నారు. రైతుల ఆందోళనను పరిగణలోకి తీసుకుని సాగర్ నీటిని వరి పంటకు పూర్తి స్థాయిలో విడుదల చేయాలని కోరారు.